కామెడీ కథ

సునీల్. జె.

# అయ్యో! మిస్సయ్యాను

**ప్రశాంత్ ఆఫీసు నుండి రావడంతోనే అటుచూసి అది రిపడ్డాడు. కోటి రూపాయలున్న సూట్‌కేస్ ఎవరో కొట్టేసినట్టు, రేణుక సర్వం పోగొట్టుకున్నదానిలా దిగాలుగా కూర్చుని వుంది. 'ఏం జరిగి వుంటుంది?' ప్రశాంత్ తల బద్దలు కొట్టుకుంటూ ఆలోచించసాగాడు. ఎన్నెన్నో జవాబులు తోచాయి.**

'ఒకవేళ పక్కింటి నీరజ చీర కొనుక్కుందా?'

'ఎదురింటి ఈశ్వరి భర్త ఇంటికి ఫ్రిజ్ తీసుకువచ్చాడా?'

'ఆ రెండూ కాకపోతే, పుట్టింటికి వెళ్ళడానికి ఎత్తుగడేమో?'

'.....సినిమా ప్రోగ్రామ్‌కి ప్లానా?'

ఏ జవాబూ సరయినదిగా తోచలేదు. ఛాయిస్ తనకు తెలియదు. అది తెలిసిన ఏకైక వ్యక్తి తన శ్రీమతి రేణుకగారే కాబట్టి, అతడు ఆమెకు దగ్గరగా నడిచాడు.

''హాయ్ రేణూ!..'' అంటూ ఆమె భుజం మీద చెయ్యేసాడు.

రేణుక అతడి చేతిని విసిరికొట్టింది. అతడి ముఖంలోకి తీక్షణంగా చూస్తూ ''దయచేసి కాసేపు నన్ను డిస్టర్బ్ చేయకండి'' అంది.

ఆమె మనసులో పుట్టిన 'వాయుగుండం' ఎలాంటిదో అర్థం కాకపోయినా, తుపాను తాకిడి ఎక్కువగానే వున్నట్లు తెలిసిపోయింది.

''అదికాదోయ్ రేణూ! అసలు ఇప్పుడేమయిందో చెపితే...'' అతడు ఆమె పక్కనే సోఫాలో కూర్చున్నాడు.

ఆమె అతడి మాటలను మధ్యలోనే కట్ చేసింది. ''...చెపితే తీరే సమస్య కాదు లెండి నాది. దేనికయినా రాసి పెట్టి వుండాలి..అప్పటి నా మూర్ఖత్వానికి తగిన శిక్ష పడింది నాకు''

తీరని సమస్య..శిక్ష..రేణుక చాలా పెద్ద పెద్ద పదాలే వాడేస్తోంది. ''అసలింతకీ ఏం జరిగింది..'' అతడు భార్యను బాగా బ్రతిమలాడాడు. చివరికి ఇక తప్పదన్నట్టు ఆమె తన మనసులోని బాధ చెప్పింది. ఆమె చెప్పింది విన్నాక, అతడికి నవ్వాలో, ఏడవాలో అర్థంకాలేదు.

ఇంతకీ ఆమె చెప్పినదేమిటంటే- పదేళ్ళక్రితం రేణుకకు పెళ్ళి చూపులు జరిగే కాలంలో 'కృష్ణమూర్తి' అనే ఓ వ్యక్తి ఓసారి ఆమెను చూసేందుకు వచ్చాడు. అప్పట్లో ఆ కృష్ణమూర్తికి ఉద్యోగం లేదు. అందులోనూ అతడు జులాయిగా తిరుగుతుంటాడని వాకబు చేస్తే తెలిసింది. దాంతో రేణుక తల్లిదండ్రులు ఆ సంబంధం వద్దనుకున్నారు. మరో ఆర్నెల్లకే రేణుక పెళ్ళి తనతో జరిగిపోయింది.

ఇప్పుడు ఆ కృష్ణమూర్తి ఎమ్మెల్యే అయ్యాడు. ఆ వార్త రేణుక చూసింది. అదే ప్రస్తుతం ఆమె బాధ.

''...దేనికయినా అదృష్టం ఉండాలండీ! అప్పట్లో నేను, 'ఆయన్ని' వద్దనుకున్నాను. ఆయన ఇంత ప్రయోజకుడవుతాడని నాకేం తెలుసు? ఇప్పుడు ఆయన ఎమ్మెల్యే అయ్యాడు. రేపు మినిస్టర్ కావచ్చు. ఆ తర్వాత ముఖ్యమంత్రి, చివరికి ఈ దేశ ప్రధాని...ఏమో! అయినా ఆశ్చర్యం లేదు. అంటే నేను నా మూర్ఖత్వంతో ప్రైమ్మినిస్టర్‌కి పెళ్ళాన్నయ్యే అదృష్టం చేజేతులా నాశనం చేసుకున్నానన్నమాట... ఎంత బాధాకరమైన విషయం ఇది. అయినా ఎవర్ననుకుని ఏం లాభం? నా తల రాత ఇలా వుంది. ఓ ఆఫీసర్‌కి పెళ్ళాంగా మిగిలిపోవాలని రాసిపెట్టి ఈ భూమ్మీదకు పంపాడా దేవుడు..''

ఆమె తాలూకు బాధను వింటూ ఏడుపులాంటి నవ్వు నవ్వుతూ సీలింగ్ ఫ్యాన్ కేసి చూడసాగాడు ప్రశాంత్.

పిల్లలిద్దరూ ట్యూషన్ నుండి ఇంటికొచ్చారు. తల్లిదండ్రులున్న పొజిషన్స్ చూసి 'మ్యాటర్ సీరియస్సేమో' అనుకుని, వాళ్ళ దగ్గరకు వెళ్ళకుండా తమ గదిలోకి వెళ్ళబోయారు.

అది గమనించిన రేణుక వాళ్ళిద్దర్నీ దగ్గరగా రమ్మని సైగ చేసింది. కాస్త భయంగానే వాళ్ళిద్దరూ దగ్గరగా వచ్చాక, 'లవకుశ' సినిమాలో అంజలీదేవి పిల్లలిద్దర్నీ చెరోపక్క వుంచుకుని ఏడ్చినట్టుగా ఏడవటం మొదలుపెట్టింది.

ఆమె ఏడుపు విని ప్రశాంత్ బిత్తరపోయాడు. చప్పున తలదించి, ''ఏమిటి రేణూ! ఇప్పుడేమయిందని ఆ ఏడుపు?'' అన్నాడు.

పిల్లలు కూడా తల్లికేసి అయోమయంగా చూడసాగారు.

రేణుక ఏడుపు ఆపకుండానే చెప్పింది ''ఏమిటోనండీ! వీళ్ళను చూస్తుంటే నాకు చాలా బాధగా వుంది''

''ఎందుకు?''

''ఎందుకేమిటండీ? ఈ పిల్లలు ఎమ్మెల్యే బిడ్డలుగా కారుల్లో తిరుగుతూ సెక్యూరిటీ మధ్య బ్రతకవలసిన వాళ్ళు. నా మూర్ఖత్వం వల్ల చివరికి ఆఫీసరు బిడ్డలుగా ఆటో రిక్షాలో స్కూలుకి వెళుతున్నారు. వీళ్ళను చూస్తుంటే నాకు జాలేస్తోందండీ...జాలేస్తోంది.''

తల నేలకేసి కొట్టుకోవాలన్న ఆలోచన కలిగింది ప్రశాంత్‌కి. అయినా తమాయించుకుని, ఆమె మీద కోప పడడంకన్నా అనునయంగానే చెప్పడంలోనే కొంత ఫలితం వుంటుందనిపించటంతో చెప్పాడు. ''చూడు! జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు నువ్వు కావాలనుకున్నా ఎమ్మెల్యే పెళ్ళానివి కాలేవు కదా! కాబట్టి గతం తలచుకుని బాధపడటం వలన ప్రయోజనం లేదు కదా? ఏమంటావ్?!''

రేణుక జవాబు చెప్పింది. ''గతము తలచి వగచే కన్నా సౌఖ్యమే లేదు అని ఓ కవి అన్నాడు కదా!?''

''మనిషి ఇలాంటి గతం తలచుకుని కూడా బాధపడే అవకాశముందని ఆ పాట రాసిన కవి అప్పట్లో ఊహించలేదు. అందుకే అలా రాసాడు''

''సర్లేండి! ఏం చేద్దాం..మీరు చెప్పినట్టు గతాన్ని తలచుకుని బాధపడినా, నేను ఎమ్మెల్యేగారి భార్యను కాలేను కదా?'' అమె నిట్టూర్చింది.

ఆ విషయం అంతటితో సమసిపోయిందనే అనుకున్నాడు ప్రశాంత్. కానీ... రేణుక మనసులో ఆ 'మధురమైన వర్తమానం' అలాగే వుందని అతడికి తెలియదు!

రాత్రి ప్రశాంత్ ప్రేమగా భార్యను దగ్గరకు తీసుకున్నాడు.

''ఏమండీ?'' అతడి ఛాతీమీదున్న జుట్టును సవరిస్తూ పలికింది రేణుక.

అతడు ఆ సమయంలో ఆమె స్పర్శాసుఖానందం అనుభవిస్తూ మరో లోకంలో విహరిస్తున్నాడు. అందువల్లే ఆ లోకంలో నుండి బయటకు రాకుండానే పరధ్యాసగా పలికాడు. ''చెప్పు మైడి




యర్ రేణూ..''

''ఎమ్మెల్యేగారి బెడ్‌రూమ్‌కి ఏ.సి. వుంటుంది కదండీ''

''అవును'' జవాబు చెప్పాకగానీ, ఆమె ఏ ఉద్దేశ్యంతో అడిగిందో అర్థం కాలేదు. అంతే. ఆ లోకంలో నుండి ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు. ముఖంలో రంగులు మారాయి. గొంతులో జాలి ధ్వనించింది. ''ఏమిటే..ఏమిటే..?! చివరికి ఈ టైమ్‌లో కూడా ఆ ఎమ్మెల్యే ప్రస్తావనేనా?''

''అదికాదండీ!..నేను ఎమ్మెల్యేగారి భార్యనై వుంటే, ఈ సమయంలో ఎ.సి.రూమ్‌లో వుండే దాన్ని కదా అని..'' అంతలోనే ఆమెకు మరో అనుమానమూ వచ్చింది. ''...అవునండీ! అప్పుడు మీరు ఈ గదిలో ఎవరితో వుండివుండేవారండీ?''

భార్య భర్తను ఎన్నో రకాలుగా వేధించటం గురించి అతడికి తెలుసు. కానీ ఈ ప్రపంచంలో ఇలాంటి వేధింపు కూడా వుంటుందా? అనుకున్నాడు అతడు. దాంతో అతడికి కోపం ముంచుకొచ్చింది.

''ఇప్పుడు మాత్రం ఆలస్యమెందుకు? వెళ్ళవే! వెళ్ళి ఆ కృష్ణమూర్తి ఎ.సి.రూమ్‌కెళ్ళి అప్పట్లో నేను బుద్ధి తక్కువై మిమ్మల్ని కాదన్నాను. ఇప్పుడు నా అజ్ఞానం నాకు తెలిసింది. మీ గొప్పతనం బోధపడింది అని వాడి దగ్గరే వుండిపో''

''వద్దండి. మిమ్మల్ని, పిల్లల్ని వదిలి నేను ఎలా వెళ్ళగలను? ఒకవేళ వెళ్ళినా ఎమ్మెల్యేగారి భార్యాబిడ్డలు నేను అక్కడ వుండేందుకు ఒప్పుకోరు కదా?''

ప్రశాంత్ తలదిండు అందుకుని అందులోని దూది మొత్తం లాగేసాడు. కొంత దూది తన నెత్తి నేసుకున్నాడు.

''ఈ పిచ్చిపన్లేమిటండీ?'' రేణుక ఆశ్చర్యపోతూ అడిగింది.

''నీలాంటి పెళ్ళాలుంటే, మొగుళ్ళకు పిచ్చిపట్టకుండా ఎలా వుంటుందే?'' ప్రశాంత్ బెడ్‌మీద రెండు పిల్లిమొగ్గలు కూడా వేసాడు.

ఏమనుకుందో ఏమో, రేణుకు మరేం మాట్లాడకుండా మరోవైపు తిరిగి పడుకుంది.

అంత జరిగాక పాపం ప్రశాంత్‌కి నిద్రెలా పడుతుంది.

కాలం అలా సాగుతూ... వుంది.

మరికొద్ది రోజులకు కృష్ణమూర్తి 'మినిస్టర్' అయ్యాడు.

ఆ వార్త పేపర్‌లో చూడగానే రేణుక, ప్రశాంత్ నడుము పట్టుకుని గాల్లోకి లేపి గిరగిరా తిప్పేసింది. ''నేను ఆ రోజే చెప్పాను కదండీ! కృష్ణమూర్తి ఏదో రోజు మినిస్టర్ అవుతాడు. ఆ

తర్వాత ముఖ్యమంత్రి చివరగా ఈ దేశ ప్రధాని..''

అప్పటికే ప్రశాంత్‌కి కళ్ళు తిరగసాగాయి. అతడు ఆమె మాటలు వినిపించుకోకుండా, ''నీ సంబరం సంతకెళ్ళా కళ్ళు తిరుగుతున్నాయ్, కిందకి దించవే తల్లీ'' అని అరిచేయసాగాడు.

పిల్లలు కూడా ఆ దృశ్యాన్ని నోళ్ళు వెళ్ళబెట్టి చూడసాగారు. వాళ్ళ అమ్మ అంతగా ఆనందపడటం చూడడం వాళ్ళకు అదే మొదటిసారి. 'అంత ఆనందమొచ్చినా అమ్మలో ఇంత బలం ఎక్కడిది? నాన్నను చీపురుపుల్లలా లేపేసిందే' అనుకోసాగారు వాళ్ళు.

ప్రశాంత్ మరింత పెద్దగా అరిచేయడంతో, ఇరుగుపొరుగు ఏదో ఘోరం జరిగిపోతుందనుకుని ఇంటి తలుపులు తట్టటం మొదలుపెట్టారు. ఆ శబ్దం ఎక్కువయ్యాక రేణుక మొగుడిని కిందికి దించింది.

పిల్లలు వెళ్ళి తలుపులు తెరిచారు. కింద శవంలా పడివున్న ప్రశాంత్‌ను, ముఖంలో ఆనందం వెలిగిపోతూ నిలబడి వున్న రేణుకను వాళ్ళు అయోమయంగా చూసారు.

రేణుక సర్దుకుని వాళ్ళకు ఏదో చెప్పి పంపేసింది.

అప్పటి నుంచి రేణుక తన గతంలోని తప్పును తలచుకుని మరింత ఎక్కువగా బాధపడసాగింది.

ఆమె మనసులో బాధపడితే ఫర్వాలేదు. భర్త, పిల్లల ముందు తరచుగా ప్రస్తావించటం మొదలెట్టింది.

ఓ రోజు ప్రశాంత్ ఆఫీసు నుండి రాగానే పేపర్ చూపిస్తూ చెప్పింది ''ఏమండోయ్ ఈ వార్త చూసారా? కృష్ణమూర్తి దంపతులకు రవీంద్రభారతిలో సన్మానం జరుగుతోంది.

నా దురదృష్టంగానీ, ఆయన భార్య స్థానంలో నేను వుండి వుంటే, ఆ సన్మానం నాకే జరిగేది కదా?''

మరో రోజు ''ఈరోజు మినిస్టర్ కృష్ణమూర్తి చాలా ఆఫీసులకి సర్‌ప్రైజ్ విజిట్ వెళ్ళి, అక్కడ మీలాంటి ఆఫీసర్ల మీద కోప్పడ్డాట్ట. ఎంతయినా మినిస్టర్ల హోదానే వేరు. ఆయన ముందు మీలాంటి ఆఫీసర్లు చేతులు కట్టుకోవలసిందే'' అంది.

భార్య ధోరణి ఒక్కోసారి విపరీతమైన కోపం వచ్చేలా చేసేది. మరోసారి తన మీద తనకే జాలి కలిగేది.

ఇంకోసారి భార్య అమాయకత్వానికి నవ్వుకునేవాడు.

యాక్షన్- రియాక్షన్‌ల విషయం పక్కన పెడితే రేణుక గతం తలచి వగచే పని ఎప్పుడు మానుకుంటుందా? అని అతడు నిరంతరం ఆలోచించేవాడు. కానీ ఎంత ఆలోచించినా జవాబు తోచేది కాదు.

'తన బ్రతుకు ఇక ఈ జన్మకు ఇలా కొత్త రకం వేధింపుతో సాగిపోవలసిందేనేమో' అని నిర్ణయించేసుకుంటున్న సమయంలో జరిగింది ఆ సంఘటన.

★ ★ ★

ఉదయం పేపర్ తిరగేస్తుంటే కనిపించిందా వార్త!


క్షణకాలం మెదడు పనిచేయలేదు. అంతలోనే ఏం తోచిందో, ప్రశాంత్ ఎగిరి గంతేసాడు. ఈల వేస్తూ హాలులో కుప్పిగంతులేయసాగాడు.

పక్క గదిలో చదువుకుంటున్న పిల్లలు హాల్లోకి వచ్చి తండ్రి చేష్టలు చూసి ముఖాలు చూసుకోసాగారు.

వంటగదిలోని రేణుక హాల్లోకి వచ్చాక కొద్దిక్షణాలు అయోమయంగా భర్త కేసి చూసింది. కొద్దిసేపటి తర్వాత తేరుకుని భర్త దగ్గరగా వెళ్ళి అడిగింది.

''ఏమిటండీ అంత ఆనందంగా వున్నారు?''

''ఆనందమా?..పరమానందమా?!..ఇంత ఆనందకరమైన వార్త నేను ఈ జన్మకు వింటానని అనుకోలేదు'' ప్రశాంత్ కుప్పిగంతులు ఆపనే లేదు.



రేణుక రెట్టించి అడిగితే, అప్పటికీ విషయం చెప్పలేదు గానీ, పేపర్‌ను ఆమెకు అందించాడు. ఆమె పేపర్‌లోని వార్తను చదివింది.

''మినిస్టర్ కృష్ణమూర్తి భార్య హత్య..కృష్ణమూర్తిపై అనుమానం''

ప్రశాంత్ భార్య చుట్టూ తిరుగుతూ, నవ్వుతూ పలికాడు. ''పాపం! మినిస్టర్ కృష్ణమూర్తి భార్యను ఎవరో చంపారు. ఆధారాలన్నీ కృష్ణమూర్తే హంతకుడు అని అంటున్నాయట. పాపం! ఆ మినిస్టర్‌ని పెళ్ళి చేసుకుని అర్థాంతరంగా చచ్చే అదృష్టం నీకు లేకపోయింది కదా రేణూ..''

రేణుక అప్పటివరకూ షాక్‌లో వుంది. అప్పుడే తేరుకుని నవ్వింది ''ఎవరికెలా జరగాలో దేవుడు ముందే రాసిపెట్టి వుంటాడండీ..ఐనా ఇంత మంచి భర్త, ఈ పిల్లలతో నిండు నూరేళ్ళు బ్రతకాలని నాకు రాసిపెట్టి వుంటే, అర్థాంతర చావు నాకెందుకొస్తుంది..ఏదేమయినా నేను అదృష్టవంతురాల్ని''

'ఆహా! కిందపడ్డా నాదే పై చెయ్యి అనుకునే ఓ నా పెళ్ళామా! నువ్వు అదృష్టవంతురాలివో కాదో, నాకు తెలియదుగానీ, నీ వేధింపులు ఈరోజు నుండి నాకు వుండవనే అనుకుంటున్నాను' మనసులో అనుకున్నాడు ప్రశాంత్.

అతడు ఊహించినట్టే ఆ తర్వాత మరెన్నడూ రేణుక 'నేను మినిస్టర్‌ని పెళ్ళి చేసుకుని వుంటే..' అని వాపోవటం జరగలేదు.

## రొటీన్‌కి భిన్నంగా..

ఎప్పుడూ సినిమాలంటే బోర్‌గా ఫీలయ్యే పరిస్థితి వస్తోంది. తమ రొటీన్ జీవితానికి భిన్నంగా ఉండాలని అంతా కోరుకుంటున్నారు. అయితే ఈమధ్య జరిగిన వివిధ దసరా వేడుకలు తారలకి కొత్తదనాన్నిచ్చాయి. కలకత్తాలో జరిగిన వివిద దసరా వేడుకల్లో ప్రముఖంగా పాల్గొంది సుస్మితాసేన్. సినిమా షూటింగ్స్‌కి దూరంగా లైఫ్‌ని దైవసాన్నిధ్యంలో గడపడం చాలా బాగుంది అంటోంది సుస్. జనానికి తెలియకుండా తారలిలా తిరిగితే బాగానే ఉంటుంది.